# పువ్వంటి పండు!





**గుత్తులుగా పూసిన పూల రెమ్మ ఎంత అందంగా ఉంటుందో... విరగకాసిన పండ్ల కొమ్మా అంతే కనువిందు చేస్తుంది. మరి పువ్వుల గుత్తులు ఇంట్లో అలంకారంగా మారినప్పుడు, పండ్ల కొమ్మలకేం తక్కువ... అనుకున్నారు ఈ తరం గృహాలంకరణ నిపుణులు. అందుకే వాటికి కూడా వేజుల్లో చోటు కల్పిస్తున్నారు. 'ఆర్టిఫీషియల్ ఫ్రూట్ బంచ్'లు ఇప్పుడు ఇంటికి కొత్త అందాన్ని తీసుకువస్తున్నాయి.**













**పండ్ల** బుట్టలు డైనింగ్ టేబుల్ మీద అలంకారంగా పెట్టుకుంటారు కొందరు. పండ్ల బొమ్మల్ని షోకేసుల్లో పెట్టుకోవడమూ తెలిసిందే. పండ్ల కొమ్మల అందం వీటికి రెండింతలు. అందుకే వాటినీ ఇష్టంగా అలంకారంలో భాగం చేస్తున్నారు. ఎర్రెర్రటి దానిమ్మ, నోరూరించే నారింజ, పసుపు వన్నె మామిడి, నీలమంటి బ్లూబెర్రీ... ఇలా పండ్లలో ఎన్ని రకాలో. పండు ఏదైనా పక్వానికి వచ్చి కొమ్మకు వేలాడుతుంటే చూడటం ఆనందాన్నిస్తుంది. ఆ ఆనందాన్ని అందంగా మలచడమే ఆర్టిఫీషియల్ ఫ్రూట్ బంచ్‌ల ప్రత్యేకత.

**అన్నీ అందంగా...**

ఇంటి అలంకరణలో విభిన్నత కోరుకునే వాళ్లు ఇటీవల పెరుగుతున్నారు. అలాగని అందం విషయంలో మాత్రం అస్సలు తగ్గేదేలే. అలాంటి వాళ్ల కోసమూ ఈ పండ్ల కొమ్మలు మంచి ఎంపిక. ఫ్రూట్ ఫేవరెట్లకు కూడా ఇవి మంచి బహుమతి. ఫ్లవర్ వేజుల కోసం రకరకాల పువ్వులను తయారు చేసినట్టే, పండ్ల కొమ్మల్లోనూ బోలెడు వెరైటీలు వస్తున్నాయి. నిమ్మ, దానిమ్మ, కమలా, మామిడి, ప్లమ్, బెర్రీలు... ఇలా చాలా రకాల ఫ్రూట్ బంచ్‌లు తయారవుతున్నాయి. వాటి ఆకులు కూడా అచ్చం ఆయా పండ్ల చెట్ల వాటిలాగే ఉండేలా రూపొందిస్తున్నారు. వీటిలో ఫాక్స్ ఫ్రూట్ బంచ్‌లైతే పరీక్షించి చూస్తే తప్ప నిజం పండ్లు కాదన్న విషయం తెలియనంత సహజంగా ఉంటున్నాయి. పండ్ల మీది మచ్చలు, తొడిమెలు, రంగు అన్నీ అసలైన వాటిలాగే కనిపిస్తాయి. అమెజాన్, అలీఎక్స్‌ప్రెస్, నెస్ట్‌ఏషియా, పీల్‌ఆరెంజ్ లాంటి వెబ్‌సైట్లలో దొరుకుతున్నాయి. వీటిని తెప్పించుకుని, జతయ్యేలా చక్కటి వేజ్‌ను ఎంపిక చేసి పెట్టామంటే... పూల సోకు పండ్లకు సోకుతుంది... కొత్త అందం పిండె వేస్తుంది!



